సాక్షి
జోగులాంబ గద్వాల

శుక్రవారం, 20, అక్టోబర్, 2023



జోగులాంబకు పట్టువస్త్రాలు
జోగులాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు.
వివరాలు IVలో ▸



ఎస్‌ఎఫ్‌ఎస్‌కు పెద్దపీట
విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంచే ఎస్‌ఎఫ్‌ఎస్‌కు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది.
వివరాలు IVలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
30.4 /19.9

వాతావరణం
రోజంతా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమవుతుంది. సాయంత్రం చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

కేటీదొడ్డి: కాంగ్రెస్ పార్టీతోనే పేదల సంక్షేమం సాధ్యమని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. తిరగబడదాం–తరిమి కొడదాం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆమె మండలంలోని తూర్పుతండా, పూజారితండా, తోటతండాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. దీంతో పలువురు రోడ్డు, స్కూల్, తాగునీరు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని పరిష్కరించాలని కోరారు. అనంతరం జెడ్పీచైర్‌పర్సన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మహిళలకు అండగా భరోసా నిచ్చేందుకు లక్షాధికారి (మహాలక్ష్మీ)ని చేసేందుకు ప్రతి నెల రూ.2500, రూ.500 కే గ్యాస్ సిలెండర్, బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ లాంటి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చేస్తామన్నారు. అలాగే, రైతులకు రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.15 వేలు అందిస్తామని, కాంగ్రెస్ పార్టీ అధికారం వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బండ్ల లక్ష్మీదేవి, వెంకట్రామిరెడ్డి, కృష్ణమూర్తి, తస్యనాయక్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

వేరుశనగ @ 6,571

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు బుధవారం 375 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్ఠం రూ.6,571, కనిష్ఠం రూ.3,686, సరాసరి రూ.4,810 ధరలు పలికాయి. అలాగే, 49 క్వింటాళ్ల ఆముదం రాగా, గరిష్ఠం రూ.5292, కనిష్ఠం రూ.5164, సరాసరి రూ.5262 ధరలు వచ్చాయి.

యోగా పోటీల్లో పతకాలు

మహబూబ్‌నగర్ క్రీడలు: కరీంనగర్‌లో గురువారం ముగిసిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలు సాధించారు. ఈ పోటీల్లో 3 బంగారు, 3 రజత, 3 కాంస్య పతకాలు సాధించారు. ఉమ్మడి జిల్లా మూడో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను కె.రాములు, బాల్‌రాజు, సభ్యులు చెన్న వీరయ్య, రమేశ్‌కుమార్, సూర్యప్రకాశ్ అభినందించారు.

గులాబీ గూటికి రావుల

- నేడు సీఎం కేసీఆర్ సమక్షంలో పార్టీ చేరికకు రంగం సిద్ధం
- వనపర్తి, దేవరకద్ర నియోజకవర్గాల కేడర్ సమీకరణ



వనపర్తి: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, వనపర్తి మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి తన కేడర్‌తో గులాబీ గూటికి చేరేందుకు రంగం సిద్ధమైంది. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరనున్నట్లు స్థానికంగా ప్రచారం జోరందుకుంది. బీఆర్‌ఎస్‌లో చేరుతున్న రావులకు శుభాకాంక్షలు అంటూ ప్రకటనలు తయారు చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతుండడంతో రావుల పార్టీ మార్పు స్థానికంగా చర్చనీయాంశమైంది. వనపర్తి, దేవరకద్ర నియోజకవర్గాల్లోని తన కేడర్‌ను కూడా పార్టీ మారేందుకు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. మండలాల వారీగా తన అనుచరులతో రావుల ఇప్పటికే మంతనాలు సాగించారని.. ప్రతి మండలం నుంచి పది వాహనాలకు తగ్గకుండా కేడర్‌ను హైదరాబాద్‌కు తరలించి గులాబీ దళంలో చేర్చేలా ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది.

సీఎంతో భేటీ తర్వాత..

గురువారం రాత్రి లేదా శుక్రవారం ఉదయం రావుల మొదట సీఎం కేసీఆర్‌తో సమావేశం అవుతారు. చర్చల అనంతరం శుక్రవారం మధ్యాహ్నం సైకిల్ దిగి కారెక్కనున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలుస్తోంది.

చక్రం తిప్పిన పాత లీడర్..

ఇదివరకు ఒకేపార్టీలో ఉన్న రావుల, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిల మధ్య చెప్పుకోదగిన సఖ్యత ఉండేది కాదు. వీరితో పాటు నాడు టీడీపీలో ఉన్న వనపర్తి మండలానికి చెందిన ఓ కీలక నేత ఏడు నెలలుగా రావులను బీఆర్‌ఎస్ గూటికి చేర్చేందుకు పావులు కదిపినట్లు ప్రచారంలో ఉంది. రావుల పార్టీ మారడంతో వనపర్తి, దేవరకద్ర నియోజకవర్గాల్లో ఉన్న కొద్దిపాటి టీడీపీ కేడర్ పూర్తిగా కనుమరుగుకానుంది.

గడ్డుకాలం..!

రెండు రాష్ట్రాల జల వనరు 'సుంకేసుల డ్యామ్' ఎండుముఖం



నీరు లేక వెలవెలబోతున్న సుంకేసుల డ్యాంలోని దిగువ భాగం

- 5 నెలలు గడిచినా జాడలేని వరుణుడు
- సుంకేసులలో నామమాత్రంగా నీటి నిల్వలు
- గతేడాది ఈ సమయానికే వందల టీఎంసీల ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాం.. ఉమ్మడి రాష్ట్రంలో ఇరు ప్రాంతాల నడుమ ఉన్న తుంగభద్ర నదిపై నిర్మింపబడి సాగు, తాగు నీరు అందించడంలో కీలకంగా మారిన వనరు. సింహభాగం ఏపీలోనే ఉన్నప్పటికీ.. జిల్లాలోని తాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు, నది తీర ప్రాంతాల్లో సాగు నీరును అందిస్తుంది. డ్యాం నిండటం వల్ల బ్యాక్ వాటర్‌తో ప్రస్తుతం తుమ్మిళ్ల ఎత్తిపోతల ద్వారా నీటిని ఆర్డీఎస్ ఆయకట్టుకు కూడా వదిలి పంటలను సస్యశ్యామలం చేస్తుంది. ప్రధానంగా కర్నూల్ , కడప జిల్లాలకు కూడా కేసీ కెనాల్ ద్వారా సాగు నీటిని అందిస్తుంది. ప్రతి ఏటా ఈ సమయానికి కళకళలాడే ఈ సుంకేసుల జలాశయం సరైన వర్షాలు లేని కారణంగా పూర్తిగా ఎండుముఖం పడుతుంది. ఎగువన ఉన్న కర్ణాటకలో కూడా అనుకున్నంత వర్షాలు కురవకపోవడం, అక్కడి ప్రాజెక్టులు నిండకపోవడంతో సుంకేసులకు నీరు రాక వెలవెలబోతుంది. గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం కనీస స్థాయిలో కూడా నీటి నిల్వలు నమోదు కాలేదని తెలుస్తుంది.

అందోళనగా ఉంది..



ప్రతి ఏడాది ఈ సమయానికి నది నిండుగా పారేది. సుంకేసుల డ్యాంలో కూడా నీరు నిండు కుండను తలపించేంది. రోజు గేట్లు తెరిచి నీటిని దిగువకు వదిలేవారు. డ్యాం నుండి బ్యాక్‌వాటర్ ద్వారా కొన్ని గ్రామాల శివారులతో పాటు, ఆర్డీఎస్ కు నీరు అందేది, కాని నేడు ఇంతవరకు నదిలో పూర్తి స్థాయిలో వరద నీటిని చూడలేదు. సరైన వర్షాలు లేని కారణంగా ఇలాంటి పరిస్థితి ఎదురైంది. ఇదే గడ్డకాలమేమోనని ఆందోళనగా ఉంది.

– పెద్ద హనుమంతు, రైతు, తుమ్మలపల్లె

విత్తనాలు కూడా వేయలే..



గడిచిన ఏడాది ఈ సమయానికే నదిలో నీరు నిండుగా ఉండటంతో విత్తనాలు జోరుగా వేశాం. రెండవ విడత వేసే వారు కూడా సాగుకు సిద్ధంగా ఉండేవారు. కాని ఈ ఏడాది ముందు నుండే సాగుకు గడ్డు కాలం కనిపించింది. వర్షాలు పూర్తిగా ముఖం చాటేశాయి. నదిలో నీరు అంతంతమాత్రంగానే ఉంది. ఈ సీజన్‌లో కూడా వర్షాలు రాకపోతే కరువు పరిస్థితులు ఎదురవుతాయేమోనని అనిపిస్తుంది.

– పరమేష్ గౌడ్, పెద్దదన్వాడ, నది పరివాహక గ్రామం

జిల్లాలో వేల ఎకరాలకు నీరు..

సుంకేసుల డ్యాం మండల కేంద్రం రాజోళిలో ప్రవహించే తుంగభద్ర నదిపై ఉంది. నది దాటితే ఏపీ లోని కర్నూలు జిల్లా. నది ఇవతలి వైపున ఉన్న జిల్లాలోని ఎన్నో గ్రామాల్లో వేల ఎకరాల పంటలకు సాగు నీరు అందుతుంది. నది ద్వారా రైతులు నీటిని వాడుకుంటూ తమ పంటలను పండించుకుంటున్నారు. ప్రతి ఏడాది ఈ సమయానికే తుంగభద్ర నది నీటి ద్వారా, సుంకేసుల డ్యాం బ్యాక్ వాటర్ ద్వారా పంటలకు నీరు అందేది. ఈ ఏడాది ఉన్న గడ్డు పరిస్థితుల కారణంగా నదిలో నీరు లేక నది పరివాహక గ్రామాల్లో కూడా విత్తనాలు వేయలేదు. కొందరు నదిలో నీరు వస్తుందని ఆశించి విత్తనాలు వేసినప్పటికీ.వర్షాబావ పరిస్థితుల కారణంగా అవి తొలగించుకుని నష్టపోయారు. ఎక్కువగా వరి, పత్తి, మొక్క.జొన్న, కంది వేసే రైతులు ఈ సంవత్సరం వాటి పైపు కేడా చూడలేదు. నదిలో నీరు వచ్చింటే తప్పకుండా వేల ఎకరాల్లో పంటలు సాగు చేసేవారు. ఈ నది నీటి ద్వారా అయిజ,వడ్డేపల్లి, రాజోళి, అలంపూర్, మానవపాడు, ఉండవెల్లి, ఇటిక్యాల మండలాల్లో పంటలకు వివిద రూపాల్లో సాగు నీరు అందేది.

గతేడాది 600 టీఎంసీలు..

గడిచిన నీటి సంవత్సరం(2022–23)లో సుంకేసుల డ్యాం ద్వారా 599.279 టీఎంసీలు నమోదయ్యాయి. కేసీ కెనాల్ ద్వారా 39.519 టీఎంసీలు విడుదలయ్యాయి. కాగా గత ఏడాది(2022) జూన్‌లో 0.508 టీఎంసీలతో మొదలైన సుంకేసుల నీటి ప్రవాహం నెల నెలా పెరుగుతూ పోయింది. కురిసిన వర్షాలు, ఎగువ ప్రాజెక్టుల నుంచి వస్తున్న నీటితో సుంకేసుల డ్యాం జల కళను సంతరించుకుని రైతుల భూములను తడిపింది. అదే ఏడాడి జూలైలో 1.998 టీఎంసీలు, ఆగష్టులో 5.760, సెప్టెంబర్‌లో 5.513, అక్టోబర్‌లో 5.820, నవంబర్‌లో 6.337, డిసెంబర్‌లో 4.788టీఎంసీలు విడుదల కాగా.. జనవరి(2023)లో 2.524, ఫిబ్రవరిలో 2.371, మార్చిలో 2.787, ఏప్రిల్‌లో 0.685, మేలో 0.458 టీఎంసీలు నమోదయ్యాయి. ఇక ఈ ఏడాది వాటర్ ఇయర్ ప్రారంభమయ్యే జూన్‌లో కనీస టీఎంసీ కూడా నమోదు కాకపోవడం విశేషం. జూలైలో 0.365 టీఎంసీలు, ఆగష్టు 0.388, సెప్టెంబర్ 1.865 టీఎంసీల నీరు మాత్రమే సుంకేసులకు చేరుకుని దిగువన ఉన్న శ్రీశైలంకు, కేసీ కెనాల్‌కు విడుదల అయ్యాయి. మొత్తానికి ఈ ఏడాదిలో 2.876 టీఎంసీలు మాత్రమే డ్యాంకు చేరుకుని దిగువకు విడుదల అయ్యాయి. కాగా గత ఏడాది ఈ సమయానికే డ్యాంలో ఉన్న నీటి నిల్వల కారణంగా నది పరివాహకంలో పంటలకు సాగు నీరందింది.

గతేడాదికి భిన్నంగా..

ఈ ఏడాది మాత్రం అందుకు బిన్నంగా అక్టోబర్ ముగుస్తున్నా కూడా నీరు లేక పంటలు ఎండే పరిస్థితితో పాటు, నేటి వరకు విత్తనాలు కూడా వేయని రైతులు ఉన్నారు. ప్రస్తుతం వర్షాలు కురవని కారణంగా ఎండలు తీవ్రంగా ఉన్నాయి. రానున్న రోజుల్లో కూడా కనీస స్థాయిలో వర్షాలు కురవకపోతే తాగునీటి పరిస్థితి ఏంటని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సుంకేసుల డ్యాంకు ఎక్కువగా ఎగువ నుండి ఇన్‌ఫ్లో రావడం, డ్యాం నుండి దిగువకు నీటి విడుదల అయ్యేది సరిగ్గా ఇదే సమయం. కానీ ఈ సమయంలోనే నదిలో నీరు నామమాత్రంగా ఉండటం ఎగువ నుండి నీరు వచ్చే అవకాశాలు తక్కువగా ఉండటంతో రైతుల్లో నైరాశ్యం నెలకొంది. వర్షాలు కురిస్తే, ఎగువన ఉన్న ప్రాజెక్టులతో పాటు, డ్యాంకు పై బాగాన చిన్నపాటి వాగులు, వంకలు నిండి నదిలో కలవడం, రీజనరేట్ వాటర్ కూడా నదిలో చేరడంతో నదిలో నీరు ఉండేది. వేసవికాలంలో తప్ప వర్షాకాలంలో ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లోలతో కళకళలాడే సుంకేసుల డ్యాం ప్రస్తుతం వెలవెలబోతుండటంతో జిల్లా ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాంగి'రేసు'లో ట్విస్ట్..!

వనపర్తిలో కొత్తకోణం




- నాగం జనార్దన్‌రెడ్డికి చిన్నారెడ్డి ఆఫర్
- బుజ్జగింపుల్లో భాగంగా మంతనాలు
- ఆ సీటుపై ఆశలు పెట్టుకున్న మేఘారెడ్డి
- నాగం మనసులో ఏముందో..
- 'హస్తం'లో చర్చనీయాంశంగా పరిణామాలు
- అభ్యర్థులను ప్రకటించని స్థానాల్లోనూ ఊహించని మార్పులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: వచ్చే ఎన్నికల్లో బరిలో నిలిచే అభ్యర్థులకు సంబంధించి కాంగ్రెస్ తొలి జాబితా ప్రకటించిన తర్వాత ఉమ్మడి పాలమూరులో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. టికెట్ ఆశించి భంగపడిన నేతలు ఒక్కొక్కరుగా అసమ్మతి గళం పెంచుతూ.. తమ రాజకీయ భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే తమ ముఖ్య అనుచరులు, కార్యకర్తలతో సమావేశమై స్వతంత్రులుగానో లేదంటే సింహం, ఏనుగు, రెండాకులు వంటి గుర్తుల్లో ఏదో ఒకదానిపై బరిలో నిలిచేలా కసరత్తు చేపట్టారు. దీంతో ఓట్లు చీలి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని గ్రహించిన కాంగ్రెస్ పెద్దలు నష్టనివారణ చర్యల్లో భాగంగా అసంతృప్త నేతలను బుజ్జగించే పనిలో పడింది. అయినా పలువురు కచ్చితంగా బరిలో నిలుస్తామంటూ తెగేసి చెబుతుండడంతో అధిష్టానం డైలమాలో పడినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో స్థానిక అంశాలను పరిగణనలోకి తీసుకుని.. అసంతృప్తిగా ఉన్న సీనియర్ నేతలకు పలు ఆఫర్లు ఇవ్వడం కొత్త 'ట్విస్ట్'లకు దారితీసింది. మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డితో చర్చల సందర్భంగా వచ్చిన ప్రతిపాదన కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటు నాగర్‌కర్నూల్, అటు వనపర్తితో పాటు అభ్యర్థులను ప్రకటించని మిగిలిన స్థానాల్లో టికెట్లు ఆశిస్తున్న నేతలు, వారి అనుచరులను కలవరానికి గురిచేస్తోంది.

'చింతలపల్లి' దారెటు..

కొల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ టికెట్ దక్కని సీనియర్ నేత జగదీశ్వరరావు తాను ఇండిపెండెంట్‌గా బరిలో ఉండనున్నట్లు ఇటీవల ప్రకటించారు. తాజాగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఠాక్రే ఆయనతో భేటీ అయి బుజ్జగించినట్లు తెలిసింది. పార్టీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. దీనిపై కార్యకర్తలతో చర్చించాక నిర్ణయం తీసుకుంటానని జగదీశ్వరరావు చెప్పినట్లు తెలుస్తోంది. మరోవైపు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర పట్టణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌తో పాటు రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు సైతం జగదీశ్వర్‌రావుతో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. వారు సైతం ఎమ్మెల్సీ పదవిని ఆఫర్ చేసినట్లు వినికిడి. ఇరు పార్టీల నుంచి ఆఫర్ నేపథ్యంలో జగదీశ్వరరావు ఏ నిర్ణయం తీసుకుంటారు.. ఆయన దారెటు అనేది ఆసక్తి రేపుతోంది.

'నాగం'కు వనపర్తి ఆఫర్..



కాంగ్రెస్ ప్రకటించిన మొదటి విడత టికెట్ల జాబితాలో నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి సంబంధించి ఇటీవల పార్టీలో చేరిన యువనేత కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డికి అవకాశం కల్పించింది. ఈ పరిణామంలో ఇక్కడి నుంచి టికెట్ ఆశించిన మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అధిష్టానంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ అధిష్టానం తీరుతోపాటు నియోజకవర్గ అభ్యర్థిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దీంతో ఇటీవల కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, మాజీ మంత్రులు జానారెడ్డి, చిన్నారెడ్డి కలిసి హైదరాబాద్‌లోని నాగం ఇంటికి వెళ్లి చర్చలు జరిపారు. ఈ క్రమంలో వనపర్తి నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని నాగంకు ఆఫర్ చేసినట్లు తెలిసింది. నాగం జనార్దన్‌రెడ్డి స్వగ్రామం సైతం వనపర్తి నియోజకవర్గంలోని రేవల్లి మండలం నాగాపూర్ కావడంతో ఈ ప్రతిపాదన తెచ్చినట్లు సమాచారం

ఇది ఎవరి మాట

వనపర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున నాగం జనార్దన్‌రెడ్డిని బరిలో నిలపాలన్న అనూహ్య ప్రతిపాదన పార్టీలో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ స్థానం కోసం మాజీ మంత్రి, ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డితోపాటు కొన్ని నెలల క్రితం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మేఘారెడ్డి సైతం పోటీపడుతున్నారు. ఈ నేపథ్యంలో చిన్నారెడ్డి సమక్షంలో జరిగిన భేటీలో వనపర్తి నుంచి నాగం జనార్దన్‌రెడ్డి పోటీ ప్రతిపాదనను పార్టీ అధిష్టానమే చేసిందా, లేక ఓ వర్గాన్ని కట్టడి చేసేందుకు చిన్నారెడ్డినే ప్రతిపాదన తెచ్చారా అనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రతిపాదనపై నాగం మనసులో ఏముందనే ఇప్పటివరకు వెల్లడించలేదు. దీంతో ఆయన ఒప్పుకుంటారా.. తిరస్కరిస్తారా.. నాగర్‌కర్నూల్ నుంచే స్వతంత్రంగా బరిలో నిలుస్తారా.. అనేదానిపై ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి.

మిగతా 6 స్థానాల్లో కొన్నింట మార్పులు..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 14 అసెంబ్లీ స్థానాలు ఉనాయి. కాంగ్రెస్ తొలి జాబితాలో ఎనిమిది స్థానాల్లో (నాగర్‌కర్నూల్ – రాజేష్ రెడ్డి, కొల్లాపూర్ – జూపల్లి కృష్ణారావు, గద్వాల – సరితా తిరుపతయ్య, అచ్చంపేట – చిక్కుడు వంశీకృష్ణ, అలంపూర్ – సంపత్, షాద్‌నగర్ – వీర్లపల్లి శంకర్, కల్వకుర్తి – కసిరెడ్డి నారాయణరెడ్డి, కొడంగల్ – రేవంత్ రెడ్డి) అభ్యర్థులను ప్రకటించారు. మిగిలిన ఆరు స్థానాల్లో (జడ్చర్ల, దేవరకద్ర, మక్తల్, వనపర్తి, నారాయణపేట, మహబూబ్‌నగర్) అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఇప్పటికే ఆయా స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసినప్పటికీ.. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ తరహాలోనే అసమ్మతుల బెడద నెలకొనడంతో కీలక నేతలు ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ప్రధానంగా పాలమూరులో హస్తం టికెట్ల లొల్లి 'హస్తిన'కు చేరగా.. జాతీయ స్థాయి ముఖ్య నేతలు పునరాలోచన చేసినట్లు తెలుస్తోంది. స్థానికత, సామాజిక వర్గం, ఆయా అభ్యర్థుల వ్యవహారశైలి తదితర అంశాలతో పాటు వెల్లువెత్తే అసమ్మతిపై పూర్తిస్థాయి అంచనాకు వచ్చిన పెద్దలు ఇది వరకు ఖరారు చేసిన జాబితాలో స్వల్ప మార్పులు చేసినట్లు పార్టీలోని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. నారాయణపేట, మక్తల్, దేవరకద్రలో మార్పులుంటాయనే ఊహాగానాలు విన్పిస్తున్నాయి.

స్ట్రాంగ్ రూంలు ఏర్పాటు చేయాలి



అలంపూర్ చౌరస్తాలో స్ట్రాంగ్‌రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ తదితరులు

- 21న నియోజకవర్గాలకు ఈవీఎంలు
- జిల్లా ఎన్నికల అధికారిణి వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్/అలంపూర్: ఈవీఎంలు భద్రపర్చడానికి నియోజకవర్గాల్లో స్ట్రాంగ్ రూములను ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో స్ట్రాంగ్ రూముల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, వాహనాల ఏర్పాటు, ఎన్నికల ప్రవర్తన నియమావళి, పర్యవేక్షణ తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20వ తేదీన ఈవియంలు ర్యాండమైజేషన్ పూర్తి చేసి, 21న అన్ని నియోజకవర్గాలకు పంపనున్నట్లు తెలిపారు. గద్వాల, అలంపూర్ నియోజకవర్గానికి ఈవీఎం బాక్సులు, వీవీ ప్యాడ్‌లను తరలించడానికి 2వాహనాలను సిద్ధం చేశామన్నారు. బార్ కోడ్ స్కానింగ్, సీరియల్ నంబర్ నమోదు ప్రక్రియను ఈఆర్‌ఓ ఆరగంటకోసారి రిపోర్టింగ్ చేయాలని, కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్‌లలో సిబ్బందిని నియమాకంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజాప్రతినిధుల సమక్షంలో ఈవీయం, వివి ప్యాడ్‌లను తెరవాలని, పోలింగ్ కేంద్రానికి సిబ్బంది ఉదయం 8గంటలకు ప్రారంభించాలని, ఆపరేటర్లకు సరైన శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఓటింగ్ ప్రక్రియ ముగియగానే ఈవీయంలు స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించి 24గంటల పాటు బందోబస్తుతో పర్యవేక్షణ ఉండాలన్నారు. రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ అపూర్వ్ చౌహాన్, అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాస్, ఆర్డీఓ చంద్రకళ, తహశీల్దార్లు ఉన్నారు.

అలంపూర్ స్ట్రాంగ్ రూం పరిశీలన

స్ట్రాంగ్ రూంల భద్రత కట్టుదిట్టంగా ఉండాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను అదేశించారు. అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో అలంపూర్ నియోజకవర్గ ఎన్నికల సామగ్రి, ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు భద్రపరిచే స్ట్రాంగ్ రూంను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఎస్పీ రితిరాజ్‌తో కలిసి గురువారం పరిశీలించారు. మార్కెట్ యార్డులో స్ట్రాంగ్ రూం కోసం సిద్ధం చేసిన గోదాంను తనిఖీ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సామగ్రి, ఈవీఎంలు, వీవీప్యాట్‌ల ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. గోదాంల పరిసరాల్లో సీసీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రాంగ్ కోసం ఎంపిక చేసిన గోదాంలలో నంబర్లు వేయించి సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. వీరితో పాటు ఆర్డీఓ చంద్రకళ, తహశీల్దార్ మంజుల, ఎన్నికల అధికారులు తదితరులు ఉన్నారు.

ఆర్‌బీఐ ఆదేశాల మేరకు నగదు బదిలీ..

రిజర్వ్ బ్యాంకు ఆదేశాల ప్రకారం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా కేరళ నుంచి హైదరాబాద్ యూబీఐ బ్యాంకుకు నగదు బదిలీ చేస్తున్నారని సమాచారం వచ్చిందని జిల్లా ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లా నుంచి ఆర్డీఓ, లీడ్ బ్యాంక్ మేనేజర్, డీఎస్పీతో పాటు అధికారులు స్పాట్‌కు వెళ్లారని, నగదుకు సంబంధించి పత్రాలను వెరిఫై చేశారన్నారు. రాష్ట్రంలోని యూబీఐ వారితో పాటు ఎస్‌ఎల్‌బీసీ నోడల్ అధికారి, ఇన్‌కాం టాక్స్, స్టేట్ లెవల్ అధికారులతో మాట్లాడి నిర్ధారణ చేసిన తర్వాత పోలీస్ భద్రత నడుమ నగదును యూబీఐ బ్యాంకు చేరినట్లు నిర్ధారించుకోవడం జరిగిందన్నారు.

సరిహద్దులో అప్రమత్తత అవసరం

గట్టు/మల్దకల్/కేటీదొడ్డి: ఎన్నికల వేళ కర్ణాటక సరిహద్దుల్లోని పోలీస్ స్టేషన్ల పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రితిరాజ్ ఆదేశించారు. గురువారం గట్టు, మల్దకల్, కేటీదొడ్డి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. ఎన్నికల వేళ పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని, నగదు తరలింపుపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, రూ.50వేలకు మించి నగదు తరలించే వారు తగిన ఆధారాలు వెంట తెచ్చుకోవాలన్నారు. పట్టుబడిన నగదును సీజ్ చేసి, జిల్లా గ్రీవెన్స్ సెల్‌కు పంచనామా చేసి అప్పగించాలన్నారు. కర్ణాటక నుంచి రాష్ట్రంలోకి వచ్చే ప్రతి వాహనాన్ని తప్పని సరిగా క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఎన్నికల్లో అల్లర్లకు కారణమని భావించే వారిని గుర్తించి, ముందస్తుగా బైండోవర్ చేయాలన్నారు. పోలీస్ స్టేషన్లలో రికార్డులను పరిశీలించారు. ఇప్పటికి దాకా పట్టుబడిన మద్యం వివరాలను తెలుసుకున్నారు. ఎస్ఐ గ్రామాల సందర్శన చేయాలని, గ్రామాల్లో జరిగే సమాచారాన్ని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు నందికర్, వెంకటేష్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి

వివిధ కేసుల నిమిత్తం పోలీస్ స్టేషన్ వచ్చే బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆమె ఆదేశించారు. ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే వారి పట్ల మర్యాద పూర్వకంగా ఉండాలన్నారు. బెల్టు షాపులను అరికట్టాలని, సీసీ కెమెరాల పని తీరుపై అడిగి తెలుసుకున్నారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలన్నారు.



గట్టు పోలీస్ స్టేషన్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ రితిరాజ్


అసత్య ప్రచారం చేయొద్దు

అలంపూర్: బ్యాంకుల నగదు బదిలీలపై అసత్య ప్రచారాలు చేయవద్దని ఎస్పీ రితిరాజ్ తెలిపారు. ప్రత్యేక ఎస్కార్టుతో బ్యాంకు నగదును తరలించిన విషయమై ఎస్పీ ఒక ప్రకటన విడదల చేశారు. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆదేశాల ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేరళ నుంచి యూబీఐ బ్యాంక్ హైదరాబాద్‌కు నగదు బదిలీ అనేది రెగ్యులర్‌గా జరిగే ప్రాసెస్ అని తెలిపారు. మంగళవారం రాత్రి డబ్బుల సమాచారం రావడంతో తక్షణమే డీఎస్పీ, ఆర్డీఓ, లీడ్ బ్యాంక్ మేనేజర్ అధికారులు కలిసి విచారణ చేసినట్లు తెలిపారు.

మహాలక్ష్మి అలంకరణలో వాసవీమాత

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శాంతినగర్ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు ఐదోరోజు మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులతో దర్శనమిచ్చారు. మహాలక్ష్మి అమ్మవారికి వివిధ రకాల కరెన్సీ నోట్లతో మాలలు తయారు చేసి అలంకరించారు. ఈ ఏడాది అమ్మవారిని రూ.36,36,369 నోట్లతో అమ్మవారిని అలంకరించినట్లు ఆర్యవైశ్యసంఘం నాయకులు తెలిపారు. ఉదయం హోమాలు, అభిషేకాలు జరిపించారు. అనంతరం మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. – శాంతినగర్





సామూహిక కుంకుమార్చనలో మహిళలు,కరెన్సీ నోట్లతో అలంకరించిన శాంతినగర్ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

‘శాసనసభలో దంపతులు’

దేవరకద్ర: ఉమ్మడి జిల్లా నుంచి రెండు స్థానాలలో ఒకే సారి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన భార్యాభర్తలు శాసనసభలో అడుగు పెట్టి రికార్డును సృష్టించారు. వారేవరో కాదు దివంగత కొత్తకోట దయాకర్‌రెడ్డి, ఆయన సతీమణి సీతాదయాకర్‌రెడ్డి. ఒకే సారి ఒకరు ఎమ్మెల్యేగా, మరొకరు ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌గా పని చేసిన ఘనత వారికే దక్కింది.

ఇద్దరు ఎమ్మెల్యేలుగా..


సీతాదయాకర్‌రెడ్డి


దివంగత కొత్తకోట దయాకర్‌రెడ్డి(ఫైల్)

నియోజకవర్గాల పునర్విభజన తర్వాత అమరచింత నియోజకవర్గం స్థానంలో దేవరకద్ర నియోజకవర్గం కొత్తగా ఏర్పడింది. ఆత్మకూర్, అమరచింత మక్తల్ నియోజకవర్గంలో విలీనం కాగా, దేవరకద్ర, భూత్పూర్, కొత్తకోట, అడ్డాకుల, చిన్న చింతకుంట ఐదు పాత మండలాలతో ఏర్పడిన దేవరకద్ర నియోజకవర్గంలో 2009 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదటి చివరి ఎన్నికలు జరిగాయి. దేవరకద్ర నుంచి సీతాదయాకర్‌రెడ్డి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయగా, మక్తల్ నియోజకవర్గం నుంచి కొత్తకోట దయాకర్‌రెడ్డి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో భార్యాభర్తలు ఇద్దరు తమ సమీప కాంగ్రెస్ అభ్యర్థులపై ఘన విజయం సాధించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సారథ్యంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష హోదాలో వారు శాసనసభలో అడుగు పెట్టారు. 2014 వరకు వారు టీడీపీ ఎమ్మెల్యేలుగా కొనసాగారు.

ఒకేసారి ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్‌లుగా..

ఉమ్మడి రాష్ట్రంలో కొత్తకోట దయాకర్‌రెడ్డి రెండు సార్లు టీడీపీ అభ్యర్థిగా అమరచింత నియోజకవర్గం నుంచి గెలుపొందారు. రెండు సార్లు అధికారంలో టీడీపీ ఉండగా ఆయన పదేళ్లు ఎమ్మెల్యేగా కొనసాగారు. మొదటి సారి 1994లో, రెండో సారి 1999లో గెలుపొందారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే 2001లో జెడ్పీటీసీ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో సీతాదయాకర్‌రెడ్డి దేవరకద్ర నుంచి జెడ్పీటీసీగా గెలుపొందారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి ఆమె జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. సీతాదయాకర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డిలు ఇద్దరు కలిసి దాదాపు నాలుగేళ్ల పాటు అధికారంలో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో ఒకసారి, తెలంగాణ ఏర్పడిన తర్వాత ఒకసారి భార్యాభర్తలుగా అధికారం చెలాయించారు.

సీతాదయాకర్‌రెడ్డి మెజార్టీ ఇలా..

2009 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సీతాదయాకర్‌రెడ్డికి 57,576 ఓట్లు రాగా, సమీప కాంగ్రెస్ అభ్యర్థి స్వర్ణసుధాకర్‌రెడ్డికి 39,540 ఓట్లు వచ్చాయి. 19,036 ఓట్ల తేడాతో సీతాదయాకర్‌రెడ్డి విజయం సాధించారు. ఇదే ఎన్నికల్లో మూడో స్థానంలో స్వతంత్ర అభ్యర్థి రావుల రవీంద్రనాథ్‌రెడ్డికి 21,660, ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి జేపీ ఎన్సీ అధినేత కేఎస్ రవికుమార్‌కు 12,769, బీజేపీ అభ్యర్థి కొమ్ము భరత్‌కు 1,928 ఓట్లు వచ్చాయి.

దయాకర్‌రెడ్డి మెజార్టీ..

మక్తల్ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కొత్తకోట దయాకర్‌రెడ్డికి 53,261 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి 47,560 ఓట్లు వచ్చాయి. 5,701 ఓట్ల తేడాతో దయాకర్‌రెడ్డి గెలుపొందారు. ఇదే ఎన్నికల్లో మూడో స్థానంలో టీఆర్ఎస్ అభ్యర్థి శ్రీధర్‌గౌడ్‌కు 11,602, బీజేపీ అభ్యర్థి నాగిరెడ్డికి 9,095, స్వతంత్ర అభ్యర్థి సూర్యనారాయణకు 1,718 ఓట్లు వచ్చాయి.

పౌరుల చేతిలో సీ విజిల్



ఎన్నికల్లో అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక యాప్

- ఫిర్యాదు చేసే 100 నిమిషాల్లో పరిష్కారం
- పౌరులను భాగస్వామ్యం చేసే ప్రయత్నం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం కొత్త పద్ధతి తీసుకొస్తూనే ఉంది. ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు పౌరులను సైతం భాగస్వామ్యం చేస్తూ.. గత సాధారణ ఎన్నికల్లో సీవిజిల్ యాప్ ప్రవేశపెట్టింది. ఎన్నికల్లో జరిగే ఎటువంటి ఉల్లంఘనలైనా ఈ యాప్ ద్వారా పౌరులు ఫిర్యాదు చేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటారు. పౌరులు ఎవరైనా ఎన్నికల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై కేవలం ఒక ఫొటో కాని, చిన్న వీడియో కాని తీసి అప్‌లోడ్ చేస్తే అధికారులు చాలా తక్షణమే చర్యలు తీసుకుంటారు. ఈ యాప్‌పై కొంత కాలంగా ఎన్నికల అధికారులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

డౌన్ లోడ్ ఇలా..

గత సాధరాణ ఎన్నికల సమయంలోనే ఎన్నికల సంఘం సీ విజిల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఈ యాప్‌ను నవీకరించారు. ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతిఒక్కరూ ప్లే స్టోర్ నుంచి ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఫిర్యాదులు చేయాల్సిన అంశాలు..

- ఎన్నికల ప్రచార సమయంలో నిబంధనలు ఉల్లంఘన.
- సమావేశాల్లో విద్వేషపూరితమైన ప్రసంగాలతో ఓటర్లను రెచ్చగొట్టడం.
- ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు డబ్బు, మద్యం పంపిణీ.
- అనుమతి లేకుండా వాహనాల వినియోగం.
- ప్రచార గడువు ముగిసిన తరువాత సైతం స్పీకర్లు, ఇతర వస్తువుల వాడకం.
- నిషేధిత సమయంలో ప్రచారం నిర్వహించడం.
- ప్రలోభాల్లో భాగంగా వస్తువులు, సామగ్రి ఇవ్వడం.
- ఓట్ల కోసం అభ్యర్థులు వారి అనుచరులు భౌతికంగా మానసికంగా భయపెట్టడం.
- ఎన్నికల నిబంధనల అమలులో అధికారుల బాధ్యతారాహిత్యం.
- ఇలా ఎన్నికల సంఘం విధించిన నియమావళి ఉల్లంఘనలో దేని గురించైనా ఫిర్యాదు చేయొచ్చు.

ఇలా చేయొచ్చు..

- ఎన్నికల ఉల్లంఘన ఫొటో కాని, రెండు నిమిషాలు ఉన్న వీడియోను కాని యాప్‌లో అప్‌లోడ్ చేయాలి.
- ఫొటో, వీడియో అప్‌లోడ్ చేసే సమయంలో ఫోన్‌లో జీపీఆర్ఎస్ ఆన్ చేసి ఉండాలి.
- ఫిర్యాదుదారులు తమ వివరాలు నమోదు చేయాల్సి అవసరం లేదు. వారి వివరాలు గోప్యంగా ఉంటాయి.
- యాప్ ద్వారా పంపిన ఫిర్యాదులు నేరుగా జిల్లా ఎన్నికల అధికారికి చేరుతాయి. అక్కడ 24 గంటలు అందుబాటులో ఉండే సిబ్బంది యాప్‌లో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత బృందాలకు పంపించి వంద నిమిషాల్లో పరిష్కరిస్తారు.

భారీగా నగదు పట్టివేత

- పోలీసుల విస్తృత తనిఖీలు

వనపర్తి/గోపాల్‌పేట/కొత్తకోట రూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును పట్టుకుని సీజ్ చేస్తున్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.6.15 లక్షల నగదు సీజ్ చేసినట్లు ఎస్పీ రక్షితా కె.మూర్తి వెల్లడించారు. గోపాల్‌పేట మండలం బుద్దారం గండి చెక్‌పోస్టును ఎస్పీ తనిఖీ చేశారు. ఈ క్రమంలో వాహనాల తనిఖీ చేపట్టగా, నాగర్‌కర్నూల్ వైపు నుంచి గద్వాలకు కారులో తరలిస్తున్న రూ.60వేల నగదును గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. పెద్దమందడి మండలం వెల్టూరు చెక్‌పోస్టు వద్ద కడప జిల్లా పులివెందులకు చెందిన ప్రసాద్ కారులో తరలిస్తున్న రూ.3లక్షలను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా జిల్లా కేంద్రంలో రూ.లక్ష, ఖిల్లాఘనపురంలో రూ.1.55 లక్షల నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో నిర్వహించిన సోదాల్లో 45 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలో రూ.9.97 లక్షల విలువజేసే 12,700 లీటర్ల మద్యం, రూ.67,36,390 నగదు సీజ్ చేసినట్లు తెలిపారు.

గద్వాల క్రైం: అక్రమంగా నగదు, మద్యం తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐలు శ్రీకాంత్, ఆనంద్ తెలిపారు. కేటీదొడ్డి మండలానికి చెందిన రమేష్ రూ.1,08,670 నగదును ఎలాంటి బిల్లులు లేకుండా తరలిస్తుండగా, సంగలపార్కు వద్ద పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అనంతపురం గ్రామానికి చెందిన కుర్వ అంజి ఇంట్లో రూ.5వేల విలువగల మద్యం సీజ్ చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని మహేష్ అనే వ్యక్తి రూ.2.19లక్షల నగదు తరలిస్తుండగా, పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అలంపూర్: 44వ జాతీయ రహదారిపై ఉన్న పుల్లూరు టోల్‌ప్లాజా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఉండవెల్లి ఎస్‌ఐ బాలరాజు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టగా, రూ.లక్ష నగదు లభించింది. కర్నూల్‌లోని ఏ–క్యాంపునకు చెందిన జోగి వెంకట్రామిరెడ్డి ఎలాంటి పత్రాలు లేకుండా రూ.లక్ష నగదును హైదరాబాద్‌కు తరలిస్తుండగా, స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మల్దకల్: మండల కేంద్రంలో రూ.2.47లక్షలను తరలిస్తుండగా, పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ కల్యాణ్ కుమార్ తెలిపారు. పట్టుబడిన నగదును జిల్లా ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.


వనపర్తి జిల్లా బుద్దారం చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ రక్షితా కె.మూర్తి

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీలోని శాంతినగర్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కొంకల గ్రామానికి చెందిన శ్రీనివాసరావు మోటార్‌సైకిల్‌పై రూ.లక్ష నగదుతో వెళ్తుండగా, పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. అదేవిధంగా తుమ్మిళ్లకు చెందిన బోయ తలారి సత్యనారాయణ రూ.2లక్షల నగదు తీసుకెళ్తుండగా, పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

పెద్దకొత్తపల్లి: కొల్లాపూర్ మండలం సోమశిల నుంచి గాజుల రాజేష్ బుధవారం రాత్రి తన కారులో రూ.3,09,170 నగదు నాగర్‌కర్నూల్‌కు తరలిస్తుండగా, పెద్దకొత్తపల్లిలో పట్టుకున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు. ఇప్పటి వరకు పోలీసుల తనిఖీలో రూ.4,99,800 పట్టుకొని ఎన్నికల నోడల్ అధికారికి అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఊట్కూరు: మండల కేంద్రంలోని చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టగా, రూ.58,500 నగదు పట్టుబడినట్లు ఎస్‌ఐ గోకరి తెలిపారు. మాగనూరు మండలం వర్కూరుకు చెందిన బుజ్జప్ప కారులో నారాయణపేటకు నగదుతో వెళ్తుండగా, పట్టుకుని సీజ్ చేసినట్లు వెల్లడించారు.

మాగనూర్: దేవరకద్ర మండలం గూరకొండకు చెందిన డి.తిరుపతి రాయచూర్ నుంచి తన వాహనంలో రూ.90వేల నగదు తరలిస్తుండగా, పట్టుకున్నట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

జడ్చర్ల: పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద కారులో తరలిస్తున్న రూ.3.75 లక్షలను స్వాధీనం చేసుకుని ఎన్నికల కమిటీ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. స్థానిక ఇందిరానగర్‌కు చెందిన వ్యాపారి సునీల్ బ్యాంకులో జమ చేసేందుకు నగదును తీసుకెళ్తున్నట్లు తమకు వివరించారని పేర్కొన్నారు. నిబంధనల మేరకు నగదును సీజ్ చేసి కమిటీకి అప్పగించామని ఎస్‌ఐ తెలిపారు.


ఎర్రవల్లిలో పట్టుబడిన నగదు

అయిజ: పట్టణంలోని పాతబస్టాండ్‌లో ఎస్‌ఐ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కర్నూలు జిల్లాకు చెందిన వ్యక్తి రూ.80వేలు తరలిస్తుండగా, గుర్తించి పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అదేవిధంగా టీ రోడ్డుపై కొత్తపల్లికి చెందిన వ్యక్తి నుంచి రూ.11,440 విలువజేసే 14.5 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నారాయణపేట రూరల్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. నారాయణపేట పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో రూ.2,22,800 నగదును పట్టుకుని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎర్రవల్లిచౌరస్తా: గద్వాలకు చెందిన సంగీత ఎలాంటి బిల్లులు లేకుండా తన కారులో రూ.లక్ష నగదు తరలిస్తుండగా, ఎర్రవల్లి చౌరస్తాలో పట్టుకున్నట్లు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు. అదేవిధంగా ఇటిక్యాల మండలం ఉదండాపురం గ్రామానికి చెందిన గుత్తి రామేశ్వర్‌రెడ్డి ద్విచక్ర వాహనంలో రూ.లక్షా 30వేలు తరలిస్తుండగా, పట్టుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.


పుల్లూరు చెక్‌పోస్ట్ వద్ద పట్టుబడిన నగదుతో పోలీసులు

సందేహాల నివృత్తికి నాఓటు

- ఓటరు సమాచారానికి ప్రత్యేక యాప్
- సమగ్ర సమాచారం లభ్యం
- ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలి



కల్వకుర్తి టౌన్: త్వరలో నిర్వహించే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఓటర్లందరూ పాల్గొని ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా ఓటర్లు తమ ఓటు వివరాలను తెలుసుకునేందుకు పలు రకాల యాప్‌లను రూపొందించింది. ఇలా రూపొందించిన యాప్‌లలో ఒకటి ‘నా ఓటు’. చాలా వరకు ఓటరు జాబితాలో పేర్లు ఉన్నా పలు కారణాలతో పోలింగ్ చిట్టీ రాకపోవడంతో కొందరు ఓటు వేసేందుకు వెళ్లలేకపోతున్నారు. ఒకవేళ పోలింగ్ చిట్టీ ఉన్నా, ఓటరు పోలింగ్‌స్టేషన్ ఎక్కడ ఉందో తెలియక చాలామంది ఇబ్బందులు పడిన పరిస్థితులు కూడా ఎదురయ్యాయి. వికలాంగ ఓటర్లకు పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు సరిగ్గా లేక, అక్కడికి వారు వెళ్లి ఓటు వేయడానికి వీలులేకుండా ఉన్న పరిస్థితి. ఇలాంటి పలు రకాల సందేహాలను ఓటర్లకు నివృత్తి చేసేందుకు గాను ఎన్నికల సంఘం నాఓటు యాప్‌ను తీసుకొచ్చింది. ఈ యాప్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవటం ద్వారా ఓటరు తన పూర్తి వివరాలను తెలుసుకోవచ్చు.

ఓటర్లు వినియోగించుకోవాలి..

ఓటర్లకు సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకొచ్చిన నా ఓటు యాప్‌ను వినియోగించుకోవాలి. ఓటరుకు తన ఓటుహక్కు గురించి ఏదైనా సమాచారం కావాలన్నా, అసెంబ్లీకి సంబంధించిన అభ్యర్థులు, అధికారుల వివరాలను దీని ద్వారా తెలుసుకోవచ్చు. ఓటు వేసే పోలింగ్‌స్టేషన్ వివరాలతో పాటుగా కేంద్రానికి ఎలా వెళ్లాలో తెలుసుకునేందుకు మ్యాప్ వివరాలు యాప్‌లో అందుబాటులో ఉంటాయి.

– శ్రీను, రిటర్నింగ్ అధికారి, కల్వకుర్తి

యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలిలా..

స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్న వారు సులభంగా నాఓటు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్లే స్టోర్‌లో నాఓటు యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. యాప్‌ని ఓపెన్ చేసిన తర్వాత ఓటరు తన ఓటరు కార్డు వివరాలను నమోదు చేయగానే, ఓటరుకు సంబంధించిన పూర్తి వివరాలు కనపడతాయి. ఇలా కాకుండా ఓటరు తన జిల్లా, అసెంబ్లీ పేరు, మండలంలోని గ్రామం పేరు యాప్ ప్రధాన పేజీలో టైపు చేసినా వివరాలు ప్రత్యక్షమవుతాయి. ఓటరుకు సంబంధించిన వివరాలు చూసి, దానిపై క్లిక్ చేస్తే ఓటరుకు సంబంధించిన ఓటరు కార్డు, పోలింగ్ కేంద్రం, ఎన్నికల అధికారులు ఇతర వివరాలు తెలుస్తాయి.

అభ్యర్థుల వివరాలు సైతం..

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వివరాలను కూడా నాఓటు యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. ఎన్నికల్లో ఏ పార్టీ తరఫున ఎవరు పోటీ చేస్తున్నారు? అభ్యర్థి ఎన్నికల అఫిడవిట్ వివరాలతో పాటు అసెంబ్లీ ముఖచిత్రం, ఎన్ని మండలాలు, పోలింగ్ స్టేషన్లు ఎక్కడెక్కడున్నాయి? ఎన్ని పోలింగ్ కేంద్రాలు? ఆయా కేంద్రాల్లో ఉన్న ఓటర్ల వివరాలు యాప్‌లో కనిపిస్తాయి. ఇవే కాకుండా ఓటరు తన పోలింగ్ కేంద్రానికి సమీపంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్ తదితర వివరాలు సైతం తెలుసుకోవచ్చు. అదే విధంగా నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల అధికారులు ఎవరు? రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, బీఎల్‌ఓలకు సంబంధించిన పూర్తి వివరాలతో పాటుగా వారి సెల్‌ఫోన్ నంబర్లతో సహా అందులో ఉంటాయి. కేవలం ఓటరు తన నియోజకవర్గానికి సంబంధించిన వివరాలను తెలుసుకోవడమే గాక, రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు సంబంధించిన వివరాలను సైతం నాఓటు యాప్ ద్వారా తెలుసుకునే వీలు ఉంటుంది.

యాప్‌లో వివరాలు..

నాఓటు యాప్‌తో ఎన్నికల సంఘం ఓటరుకు చాలా వివరాలను అందుబాటులోకి తెచ్చింది. ఓటరు కార్డు వివరాలను అందులో నమోదు చేస్తే అతడికి సంబంధించిన పూర్తి వివరాలు కనిపిస్తాయి. ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉంది.. పోలింగ్ కేంద్రం వివరాలు, పోలింగ్ కేంద్రానికి తన ఇంటి నుంచి ఎలా వెళ్లాలి.. పోలింగ్ కేంద్రంలో ఎలాంటి సదుపాయాలు ఉన్నాయన్న వివరాలను తెలుసుకోవచ్చు. వీటికి తోడు ఓటరు వికలాంగుడు అయితే పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. వికలాంగ ఓటర్లకు కేటాయించిన సిబ్బంది పూర్తి వివరాలను సైతం అందుబాటులో ఉండేలా యాప్ రూపకల్పన చేసినట్లు ఎన్నికల అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో పోలింగ్ స్టేషన్లు, ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు
నాగర్‌కర్నూల్	259	1,12,657	1,11,971	03
కల్వకుర్తి	262	1,17,393	1,13,250	07
అచ్చంపేట	265	1,17,124	1,16,439	02
కొల్లాపూర్	269	1,16,975	1,12,420	04
వనపర్తి	296	1,32,971	1,32,644	07
గద్వాల	303	1,24,763	1,29,096	10
అలంపూర్	290	1,16,989	1,19,080	07
నారాయణపేట	270	1,12,697	1,14,668	02
మక్తల్	284	1,17,576	1,21,009	01
మహబూబ్‌నగర్	272	1,21,397	1,21,960	10
జడ్చర్ల	274	1,06,922	1,05,469	04
దేవరకద్ర	289	1,13,528	1,14,556	0
కొడంగల్	279	1,14,140	1,16,099	12
షాద్‌నగర్	252	1,13,872	1,11,583	15




ప్రచార పర్వంలో..

అసెంబ్లీ ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో ఉమ్మడి జిల్లాలో పలువురు ఎమ్మెల్యే అభ్యర్థులు, టికెట్ ఆశిస్తున్న వారు ప్రచార పర్వంలో దూసుకెళ్తున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ పూర్తిస్థాయిలో, కాంగ్రెస్ పార్టీ కొన్నిస్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా.. బీజేపీ అభ్యర్థిత్వాలను ఖరారు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అభ్యర్థుల బంధువులు, నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో తిరుగుతూ తమవారిని గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు స్వాగతం పలుకుతున్న అచ్రాబాద్ మండలం వెంకటేశ్వరబావి గ్రామస్తులు


మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ పథకాలను వివరిస్తున్న యెన్నం శ్రీనివాస్‌రెడ్డి


కల్వకుర్తి మండలం కుర్మిద్దలో సర్పంచ్ జ్యోతిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డి


కేటీదొడ్డి మండలంలో మహిళలతో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత


తెలకపల్లి మండలం ఆలేరులో మహిళతో మాట్లాడుతున్న కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి


శ్రీరంగాపూర్ మండలం జానంపేటలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి భార్య వాసంతి

జోగుళాంబకు పట్టువస్త్రాల సమర్పణ

- ప్రభుత్వం తరపున అందజేసిన కలెక్టర్, ఎస్పీ
- వైభవోపేతంగా రథోత్సవం ఊరేగింపు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు తీసుకువస్తున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఎస్పీ రితిరాజ్

జోగుళాంబ శక్తిపీఠం: రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామివార్లకు రాష్ట్ర ప్రభుత్వం తరపున కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఎస్పీ రితిరాజ్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్య, ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద్‌శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఉభయ ఆలయాలను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వం తరపున తీసుకొచ్చిన పట్టువస్త్రాలను ఆలయంలో అర్చకులకు అందజేశారు. రాష్ట్ర ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని సంకల్పం చేయించి పూజలు జరిపించారు. అనంతరం ఆలయ ఆవరణలో జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామివారి రథోత్సవానికి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ప్రాకార మండపంలో రథాన్ని లాగుతూ ఆలయం చుట్టూ ఊరేగించి భగవంతుడి సేవలో తరించారు.

ఆధ్యాత్మిక వాతావరణంలో..

జోగుళాంబ కళావేదిక మండపంపై గద్వాల బాలభవన్‌కు చెందిన చిన్నారుల చేత భరత నాట్యం, కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలను కలెక్టర్, ఎస్పీ తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఎంతో అట్టహాసంగా, చక్కని ఆధ్యాత్మిక వాతావరణంలో, భక్తిశ్రద్ధల మధ్య జరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ఆలయ అధికారులను అభినందించారు. చిన్నారుల నృత్య ప్రదర్శన చూపరులను ఎంతగానో అలరించిందని, ఇలాంటి ప్రదర్శనలు మరిన్ని ఇవ్వాలని ఆకాంక్షించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీలు చిన్నారులకు, నాట్యాచార్యులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజుల, సీఐ రాజు, ఎస్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.


జోగుళాంబ ఆలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఎస్పీ రితిరాజ్

చేనేత కార్మికులకు అభినందన

అమ్మవారి ఆలయంలో మగ్గం ఏర్పాటు చేసుకుని పట్టు చీరను 48 గంటల్లో నేసి అమ్మవారికి సమర్పించిన చేనేత కార్మికులను, ఈ కార్యక్రమానికి పూనుకున్న పద్మశాలి జయరాజ్‌ను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులను ఆదుకోవాలని కోరగా కలెక్టరేట్‌కు వచ్చి సమస్యను తెలియజేయాలని కలెక్టర్ వారికి సూచించారు.

అప్రమత్తంగా ఉండండి

బ్రహ్మోత్సవాలకు ప్రతిరోజు ఎంత మంది భక్తులు వస్తారు.. బందోబస్తు ఇంకా ఏమైనా కావాలా అని ఎస్పీ రితిరాజ్ ఎస్ఐ రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ ప్రతిరోజు 4– 5 వేల మంది దాక వస్తున్నారని, 24న తెప్పోత్సవం సందర్భంగా 15 వేల మంది దాకా వస్తారని చెప్పారు. దీంతో ఎస్పీ స్పందిస్తూ తెప్పోత్సవం జరిగే చోట మరింత బందోబస్తు పటిష్టం చేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని సూచించారు.

క్లుప్తంగా

గద్వాలలో భారీ చోరీ

- రూ.14 లక్షల నగదు, 10 తులాల బంగారు ఆభరణాలు అపహరణ



గద్వాల క్రైం: పెద్దల పండుగ కోసం ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బీరువాలో ఉన్న రూ.14 లక్షల నగదు, 10 తులాల బంగారు ఆభరణాలు అపహరించిన ఘటన గురువారం జిల్లాకేంద్రంలో వెలుగు చూసింది. బాధితులు, పోలీసుల కథనం మేరకు... వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన సునీత కొన్నేళ్లుగా కుటుంబ సభ్యులతో కలిసి జిల్లాకేంద్రంలోని సంతోష్‌నగర్‌కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటుంది. ఇటీవల గ్రామంలో ఉన్న వ్యవసాయ పొలాన్ని విక్రయించింది. వచ్చిన డబ్బుతో పట్టణంలోనే ఓ ఇంటిని కొనుగోలు చేద్దామని కుటుంబ సభ్యులు నిర్ణయించుకొని డబ్బును బీరువాలో దాచారు. పెద్దల పండుగా కోసం ఇంటికి తాళం వేసి ఈ నెల 12న స్వగ్రామమైన రామాపురానికి వెళ్లారు. గురువారం ఉదయం వచ్చి చూడగా ఇంటి తలుపునకు వేసిన తాళం వేరేది ఉండటంతో ఇరుగు పొరుగు వారి సాయంతో తాళం విరగ్గొట్టి ఇంట్లోకి వెళ్లి చూశారు. సామగ్రి చిందరవందరగా పడి ఉండటం, బీరువాలో దాచిన నగదు, బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీసీఎస్ సీఐ రామస్వామి, పట్టణ ఎస్ఐలు శ్రీకాంత్, అబ్దుల్ షుకూర్, డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీంలు ఘటనస్థలాన్ని పరిశీలించాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ వివరించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 20 రోజుల జైలుశిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఓ వ్యక్తికి 20 రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు బుధవారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఇద్దరు మద్యం తాగి వాహనం నడుపుతున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. వీరిని గురువారం కోర్టులో హాజరుపరచగా, పాండు అనే వ్యక్తికి 20రోజుల జైలుశిక్ష, రూ.2,500 జరిమానా, మరో వ్యక్తికి రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి నిర్మల తీర్పు ఇచ్చారని పోలీసులు తెలిపారు.

యువకుడు రిమాండ్‌కు..

మాగనూర్: చోరీకి పాల్పడిన ఓ యువకుడిని పట్టుకొని గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మల్లేష్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మహారాష్ట్రలోని పూణెకు చెందిన పవన్ సచిన్ షాసని, అతడి స్నేహితుడు మాగనూర్‌కు చెందిన గొల్ల నరేష్ మొబైల్ దుకాణంలో తరచూ ఆన్‌లైన్ నగదు బదిలీ చేస్తూ పరిచయం పెంచుకున్నారు. బుధవారం దుకాణానికి వచ్చి రూ.25 వేలు ఆన్‌లైన్ బదిలీ చేయించుకొని డబ్బులు మక్తల్‌లో స్నేహితుడి వద్ద ఉన్నాయని నమ్మించి ముగ్గురు కలిసి బైక్‌పై వెళ్లారు. అక్కడికి వెళ్లాక బస్టాండ్ వద్ద నరేష్, స్నేహితుడిని నిలబెట్టి పవన్ సచిన్ షాసని నరేష్ ద్విచక్ర వాహనం తీసుకొని డబ్బులు తెస్తానంటూ వెళ్లి పరారయ్యాడు. కాసేపటి తర్వాత స్నేహితుడు కూడా అక్కడి నుంచి జారుకోవడంతో మోసపోయాయని గుర్తించి మాగనూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు పవన్ సచిన్ షాసని మక్తల్‌లో పట్టుకొని బైక్, నగదు స్వాధీనం చేసుకొని మహబూబ్‌నగర్ జైలుకు తరలించారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు.

యువకుడిపై కేసు నమోదు

గద్వాల క్రైం: యువతి ఆత్మహత్యకు కారకుడైన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ఆనంద్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. గద్వాల మండలానికి చెందిన ఓ యువతిని ఇటిక్యాల మండలానికి చెందిన ప్రమోద్ అనే యువకుడు ప్రేమ పేరుతో మోసం చేయడంతో బుధవారం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, గురువారం చికిత్స పొందుతూ మృతి చెందింది. యువతి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ప్రమోద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైల్లో నుంచి పడి మహిళ దుర్మరణం

మదనాపురం: ప్రమాదవశాత్తు రైల్లో నుంచి పడి మహిళ దుర్మరణం చెందిన ఘటన మదనాపురం మండలం అజ్జకొల్లు సమీపంలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ వివరాల మేరకు.. గద్వాల పట్టణానికి చెందిన నేహా కౌసర్ (26) గురువారం హైదరాబాద్ వెళ్లేందుకుగాను కర్నూల్ టౌన్–కాచిగూడ రైలు ఎక్కింది. అజ్జకోలు గ్రామశివారులో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడింది. గమనించిన తోటి ప్రయాణికులు వెంటనే వనపర్తి రోడ్ స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించారు. ఆమెను చికిత్స నిమిత్తం 108లో వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. మృతురాలి భర్త మహమ్మద్ యాసీన్ హైదరాబాద్‌లోని ఓ బేకరీలో పని చేస్తున్నాడు. వారికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారులే కీలకం


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

- కలెక్టర్ రవినాయక్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి.రవినాయక్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల శిక్షకులతో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఎన్నికల ఘట్టంలో పోలింగ్ రోజు చాలా ముఖ్యమైనదని, ఎన్నికల సంఘం ఆదేశాలను ప్రతి అధికారి పాటించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం జారీ చేస్తున్న నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, ఎన్నికలపై ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యంగా ఉండవద్దని కోరారు. పోలింగ్ విధి నిర్వహణపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. ఎన్నికల విధులకు నియమించిన ఉద్యోగులు అభ్యర్థులకు అనుబంధంగా ఉండకూడదని, ఎన్నికల నియమావళిని కఠినంగా అమలు చేస్తున్నందున జాగ్రత్తగా విధులు నిర్వహించాలని చెప్పారు. ప్రతి పనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ముఖ్యంగా ఎన్నికల మెటీరియల్, ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల నిర్వహణ, అనుసంధానం, ఓటరు జాబితా మార్క్డ్ కాపీ, పీఓ, ఏపీఓ డైరీ, వారి విధులు వంటి అన్ని విషయాలను ఒకటికి రెండు మార్లు చూసుకోవాలని చెప్పారు. మరోసారి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇవ్వాలని ఆయన ట్రైనింగ్ నోడల్ అధికారి, డీఈవో రవీందర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో దేవరకద్ర రిటర్నింగ్ అధికారి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డిప్యూటీ సీఈఓ మున్ని తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు కొనసాగుతున్న వరద

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. గురువారం రాత్రి 7 గంటల వరకు 3వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైనట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 108, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, కోయిల్‌సాగర్‌కు 315, ఎడమ కాల్వకు 1,190, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50, సమాంతర కాల్వకు 900, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కులతో కలిపి మొత్తం 3,994 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 7.480 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటినిల్వ

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో గురువారం 1,020 అడుగులకు నీటిమట్టం చేరింది. జూరాల ఎడమ కాల్వతో 1,250, సమాంతర కాల్వ నుంచి 900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎన్టీఆర్ కాల్వ నుంచి వ్యవసాయ అవసరాలకు 1,250, కుడికాల్వకు 15, ఎడమ కాల్వకు 30 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భీమా ఫేజ్–2 నుంచి 816, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రనిల్ రెడ్డి తెలిపారు.

చదువుతోపాటు క్రీడలు ముఖ్యం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీఓ లక్ష్మీదేవి

రాజాపూర్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమని ఎంపీడీఓ లక్ష్మీదేవి అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం 67వ ఎస్‌జీఎఫ్ అండర్–17 బాలబాలికల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందన్నారు. గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి టోర్నీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను ఇక్కడ నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. ఉమ్మడి పది జిల్లాల నుంచి 280 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నట్లు డీవైఎస్ఓ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆనంద్‌కుమార్, ఎస్ఐ వెంకట్‌రెడ్డి, పీడీ వడ్డెన్న, ఎంఈఓ వెంకటయ్య, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చెన్నవీరయ్య పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం



పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని సంతలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి వివరాల మేరకు.. ఎద్దుల సంత షెడ్‌లో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు.. మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా, అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానిని చేరుకుని వివరాలు సేకరించారు. మృతి చెందిన వ్యక్తి వయసు 55నుంచి 58 ఏళ్లు ఉంటుందని, తెల్ల షర్ట్, పంచ, టవల్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని వనపర్తి మార్చురీకి తరలించామని, మృతుడికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే పెబ్బేరు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

ఆకట్టుకునేలా ఆర్టీసీ



- దసరా పండుగ నేపథ్యంలో లక్కీడ్రా
- పది మంది విజేతలు, ఒక్కొక్కరికి రూ.9,900
- గతంలో రాఖీ పౌర్ణమికి మహిళా ప్రయాణికులకు లక్కీడ్రా

స్టేషన్ మహబూబ్‌నగర్: బస్సుల్లో ప్రయాణికుల ఆక్యూపెన్సీ శాతాన్ని మరింత పెంచుకునేలా ఆర్టీసీ సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. పండుగ రోజుల్లో వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు చూరగొంటుంది. గత నెలలో రాఖీ పౌర్ణమి సందర్భంగా మహిళా ప్రయాణికుల కోసం లక్కీడ్రా చేపట్టారు. రీజియన్‌లోని మహబూబ్‌నగర్, అచ్చంపేట, గద్వాల, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, షాద్‌నగర్, వనపర్తి బస్టాండ్‌లలో ప్రత్యేక లక్కీబాక్స్‌లను ఏర్పాటు చేయగా విశేష స్పందన లభించింది. ఆగస్టు 30, 31 మహిళా ప్రయాణికుల కోసం లక్కీడ్రా బాక్స్ ఏర్పాటు చేశారు. మహిళలు తాము ప్రయాణించిన టికెట్లపై పేరు, మొబైల్ నంబర్ రాసి బాక్సుల్లో వేయగా రీజియన్ స్థాయిలో లక్కీడ్రా నిర్వహించగా ఎం.వెంకటమ్మ–ప్రథమ, పర్సాపూర్ (కొడంగల్), ఎం.కవిత ద్వితీయ (నారాయణపేట), ఖైరున్నిసా తృతీయ (వనపర్తి) గెలుపొంది రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేల నగదు బహుమతులు అందుకున్నారు.

9 డిపోల్లో బాక్స్‌లు

రీజియన్ పరిధిలోని 9 డిపోల పరిధిలోని ప్రధాన బస్టాండ్లలో లక్కీడ్రా బాక్స్‌లు ఏర్పాటు చేశారు. అచ్చంపేట, తెలకపల్లి, డిండి, గద్వాల, అయిజ, కల్వకుర్తి, ఆమన్‌గల్, కొల్లాపూర్, కోస్గి, మహబూబ్‌నగర్, జడ్చర్ల, నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, నారాయణపేట, మద్దూర్, మరికల్, మక్తల్, షాద్‌నగర్, షాబాద్, ఆరాంఘర్, వనపర్తి, ఖిల్లాఘనపూర్, పెబ్బేర్, కొత్తకోట బస్టాండ్లలో లక్కీడ్రా బాక్స్‌లు ఏర్పాటు చేయనున్నారు.

దసరాకు ప్రత్యేక లక్కీడ్రా

దసరా పండుగ నేపథ్యంలో ప్రయాణికులు అందరికీ లక్కీడ్రా నిర్వహిస్తున్నారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు, 28 నుంచి 30 తేదీల్లో బస్సుల్లో ప్రయాణించే వారందరూ ఈ లక్కీడ్రాలో పాల్గొనవచ్చు. ప్రతి రీజియన్‌లో గెలుపొందిన ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలకు ఒక్కొక్కరికి రూ.9,900 చొప్పున బహుమతులు అందజేయనున్నారు. ఆయా తేదీల్లో ప్రయాణం పూర్తయ్యాక టికెట్ వెనకాల పేర్లు, ఫోన్ నంబర్ రాసి బస్టాండ్లలో ఏర్పాటు చేసిన డ్రాప్‌బాక్స్‌లో వేయాలి.

సద్వినియోగం చేసుకోండి



గతంలో రాఖీ పండుగ సందర్భంగా మహిళా ప్రయాణికుల కోసం లక్కీడ్రా నిర్వహించగా మంచి స్పందన వచ్చింది. ఇదే స్ఫూర్తితో దసరా పండుగ నేపథ్యంలో లక్కీడ్రా నిర్వహిస్తున్నాం. ఈనెల 21 నుంచి 23, 28 నుంచి 30 తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసేవారు టికెట్ వెనుక తమ పేర్లు, ఫోన్ నంబర్ రాసి బాక్సుల్లో వేయాలి. లక్కీ డ్రా తీసి రీజియన్ స్థాయిలో పది మంది విజేతలకు నగదు బహుమతి అందజేస్తాం. ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – శ్రీదేవి, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, మహబూబ్‌నగర్


మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

పండుగకు ప్రత్యేక బస్సులు

దసరా పురస్కరించుకుని రీజియన్ వ్యాప్తంగా 374 అదనపు సర్వీసులు నడపనున్నారు. 13వ తేదీ నుంచి అదనపు బస్సులు నడుస్తున్నాయి. పండుగ రద్దీ దృష్ట్యా ఈనెల 23 వరకు ప్రత్యేక బస్సులు నడపడానికి ఆర్టీసీ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. హైదరాబాద్ రూట్లో అధికంగా అదనపు బస్సులు నడుపుతున్నారు.

ఎన్‌ఎస్‌ఎస్‌కు పెద్దపీట


గండీడ్ మండలం దేశాయ్‌పల్లిలో ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో పాల్గొన్న పీయూ విద్యార్థులు (ఫైల్)

- యూనిట్లకు భారీగా నిధుల పెంపు
- క్యాంప్‌ల నిర్వహణకు రూ.13వేలు, సాధారణ కార్యక్రమాలకు రూ.12,500
- నిర్వహణ ఖర్చులన్నీ ఆన్‌లైన్ ద్వారా చెల్లించే విధంగా మార్పు
- మొదటి విడత రూ.20లక్షలు విడుదల
- త్వరలో క్యాంపుల నిర్వహణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెంచేందుకు నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల నిర్వహణకు నిధులను భారీగా పెంచింది. నిర్వహణ ఖర్చులన్నీ ఆన్‌లైన్ ద్వారా చెల్లించేవిధంగా మార్పులు చేసింది. డిగ్రీ, పీజీ స్థాయిలో సుమారు 100మంది వలంటీర్లతో ఒక్కో యూనిట్‌ను అధికారులు ఏర్పాటు చేస్తారు. ఇలా పాలమూరు యూనివర్సిటీ పరిధిలో మొత్తం 120 కళాశాలలు ఉండగా.. వీటిలో అన్ని యూనిట్లలో కలిపి 10వేల మంది వలంటీర్లు ఉన్నారు. వీరు స్పెషల్ క్యాంప్‌లు, సాధారణ కార్యక్రమాలు నిర్వహించే క్రమంలో నిధులు వినియోగించాల్సి వస్తోంది. ప్రస్తుతం పెరిగిన ధరలు, వలంటీర్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిధులను భారీగా పెంచింది. అంతేకాకుండా నిధులు పక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టింది. కేవలం ఆన్‌లైన్ ద్వారా మాత్రమే నిధులు వినియోగించే విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. కాగా ఆన్‌లైన్ చేసే క్రమంలో క్యాంప్‌ల నిర్వహణకు కొన్ని ఇబ్బందులు తలెత్తడంతో మొత్తం నిధుల్లో 25శాతం సుమారు రూ.20లక్షలు యూనిట్ల ఖాతాలకు బదిలీ చేసింది. దీంతో మరోసారి పెద్దఎత్తున క్యాంపుల నిర్వహణకు కోఆర్డినేటర్లు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే క్యాంపులు ప్రారంభం కావాల్సి ఉండగా.. సెలవుల కారణంగా వాయిదా పడింది.

ఆన్‌లైన్‌లో నిధుల చెల్లింపు..

గతంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లకు చెల్లించే నిధులు నేరుగా కోఆర్డినేటర్లకు ఇవ్వడం వల్ల దుర్వినియోగమయ్యాయన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో నిధుల చెల్లింపు పూర్తిగా ఆన్‌లైన్‌లో పీఎఫ్‌ఎంఎస్ సైట్ ద్వారా చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ ఆధీనంలో ప్రత్యేక ఖాతాలను నిర్వహించనున్నారు. వివిధ స్టేషనరీ వస్తువులు, ఇతర సామగ్రి, క్యాంపు సమయంలో భోజనాలు, తాగు నీరు, పనిముట్లు ఇలా ఏ వస్తువు కొనాలన్నా నేరుగా వీటిని సరఫరా చేసే వ్యాపారుల ఖాతాలకు నిధులను బదిలీ చేస్తారు. ఈ పద్ధతి ద్వారా నిధుల ఖర్చు మరింత పారదర్శకంగా ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

నిధుల కేటాయింపు ఇలా..

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు, పచ్చదనం, శుభ్రత పెంపు ఇతర సేవలను సాధారణ కార్యక్రమాలుగా పరిగణిస్తారు. గతంలో సాధారణ కార్యక్రమాలకు రూ.22,500 కేటాయించగా, వీటికి అదనంగా రూ.12,500 ఇవ్వనున్నారు. మొత్తం రూ.35వేలు కేటాయించారు. ఇక గ్రామాల్లో క్యాంపుల నిర్వహణకు గతంలో రూ.22వేలు ఇస్తుండగా, ప్రస్తుతం రూ.13వేలను అదనంగా ఇస్తున్నారు. సాధారణ కార్యక్రమాలు, క్యాంపుల నిర్వహణకు కలిపి గతంలో రూ.50వేలు ఇస్తుండగా, ప్రస్తుతం దాన్ని రూ.70వేలకు పెంచారు.

పెద్ద ఎత్తున క్యాంపులను నిర్వహిస్తాం..



పాలమూరు యూనివర్సిటీ పరిధిలో మొత్తం 100కుపైగా యూనిట్లు పనిచేస్తున్నాయి. నిధుల ఖర్చులో పారదర్శకత కోసం ప్రభుత్వం ఆన్‌లైన్ విధానం తీసుకురావడం మంచి విషయం. సెలవులు పూర్తయిన వెంటనే 10వేల మంది వలంటీర్లతో క్యాంపులు నిర్వహించి, పలు అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచే విధంగా చర్యలు చేపడతాం. – లక్ష్మీకాంత్ రాథోడ్, పీయూ వైస్‌చాన్స్‌లర్

నిధులు పెరిగాయి.



గతంతో పోలిస్తే ఒక్కో యూనిట్‌కు ప్రభుత్వం రూ.20వేల వరకు నిధులను పెంచింది. దీని ద్వారా ఒక్కో యూనిట్‌కు రూ.70వేల వరకు నిధులు సమకూరుతాయి. నిధుల కొరత లేకుండా వలంటీర్లు పని చేస్తారు. ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించే విధానం వల్ల క్యాంపుల నిర్వహణలో కొంత ఆలస్యం జరిగింది. సెలవుల అనంతరం క్యాంపులు నిర్వహిస్తాం.. – ప్రవీణ, ఎన్‌ఎస్‌ఎస్ అధికారిణి, పీయూ

ఆర్డీఎస్, జూరాల నుంచి సాగునీరు అందించండి

- ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్‌ను కలిసిన ఎమ్మెల్సీ చల్లా


ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

అలంపూర్: ఆర్డీఎస్, జూరాల కాల్వల ద్వారా నియోజకవర్గ రైతులకు సాగునీరు సరఫరా చేయాలని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి కోరారు. గురువారం హైదరాబాద్‌లో ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ రఘునాథ్‌బాబును ఎమ్మెల్సీ కలిసి ఈ విషయమై మాట్లాడారు. స్పందించిన ఇరిగేషన్ చీఫ్ ఈ నెల 20న సాగునీటిని విడుదల చేస్తామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా ఏపీలోని కర్నూలు జిల్లా ఈఎన్‌సీ నారాయణరెడ్డితో ఫోన్‌లో మాట్లాడి తుంగభద్ర డ్యాం నుంచి ఇండెంట్ పెట్టాలని కోరినట్లు తెలిపారు.

జాతీయ నెట్‌బాల్ టోర్నీలో విజేతగా నిలవాలి


రాష్ట్ర నెట్‌బాల్ జట్లతో డీవైఎస్‌ఓ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ క్రీడలు: జాతీయ స్థాయి నెట్‌బాల్ టోర్నీలో రాష్ట్ర జట్టు ప్రతిభ చాటి విజేతగా నిలవాలని డీవైఎస్‌ఓ శ్రీనివాస్ ఆకాంక్షించారు. గోవా రాష్ట్రం పంజిమ్‌లో ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర పురుషుల, మహిళా జట్లతో పాటు ఫాస్ట్–5 మహిళా జట్టు గురువారం బయల్దేరాయి. ఈ సందర్భంగా డీవైఎస్‌ఓ మాట్లాడుతూ జాతీయ పోటీల్లో రాణించి విజేతగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో నెట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి ఖాజాఖాన్, ఉపాధ్యక్షుడు సాదత్‌ఖాన్, సోహైల్ ఉర్ రహెమాన్, రామ్మోహన్, అంజద్‌అలీ, వినోద్‌కుమార్, ముంతాజ్, స్వప్న, షకీల్ పాల్గొన్నారు.